# ఓటుతల్లి

-సింహ ప్రసాద్

దండాలండి. బాబయ్యా దండాలండి. అలా చూత్తారేంటి బాబయ్యా-నానండి సెట్టుకాడి ముసిల్దాన్ని. వూరవతల పంట కాల్వకెళ్ళే దార్లో రాయిసెట్టు పక్కన గుడిసె లేదూ అందులో వుంటున్న ముసిల్దాన్ని-నర్సినండి బాబయ్యా. సచ్చి సొర్గానున్న లచ్చిగాడి పెళ్లాన్నండి.

హమ్మయ్య! తమరు నవ్వేరు. ఏయ్యేనుగుల బలం వొచ్చిందండి. మాయదారికాలం కదా బాబయ్యా. ఎరిగున్నోళ్ళే ఎరగనట్టు మొహం ఎట్టి పక్కనుంచెల్లిపోతన్న కలికాలం కదా బాబయ్యా.

బాబయ్యా! ఈ ముసిల్దానికి సిన్నపని సేసి పెట్టాల బాబయ్యా. తవర్లాటి కనికరం కల పెద్దోరు తప్ప నాకెవరున్నారు సెప్పండి-మొగుడా కొడుకా! ఎవ్వర్లేని ఒంటికాయ సొంటికొమ్మని. కాటిక్కాలు సాచికూకున్న ముసిల్దాన్ని. బాబ్బాబు. మీరే ఇంత సాయం సేసి పున్నెం కట్టుకోవాల. అబ్బే. నాకేం ఇవ్వక్కర్లేదు సావీ..కూసింత మాట సాయం సేత్తే సాలు బాబూ..సచ్చి మీ కడుపున పుడతా!

దుర్గారావు గోర్లేరూ...అదేబాబూ ఎగస్పార్టీవోళ్ళు దుర్మార్గపు రావుగోరు దుర్మార్గాలరావుగోరూ అని గోలసేశారే ఆ దుర్గారావుగోరు. ఆరితో సిన్నమాట సెప్పాలి బాబయ్యా. తవరి కోసం సెట్టుకింది ముసిల్ది-రోడ్డు మీద దూళ్ళకాడి పేడ పోగేసి పిడకల్జేసి అమ్ముకుని బతికే ముసిల్ది- ఎవుర్లేని ఏకాకి ముసిల్ది ఒకటే కలవరిస్తోంది. కన్నీళ్ళెట్టుకుంటాందని సెప్పాలి బావూ. నాకివ్వాల్సిన సొమ్ము ఇమ్మని సెప్పాలి సామీ. సెబుతారా బాబయ్యా?

అలా సూత్తారేంటి బాబయ్యా. నామాట మీద నమ్మకంలేదా? కోట్లకి పడగెత్తిన దుర్గారావుగోరేంటి కూటికి తికాణాలేని ఈ ముసిల్దానికి సొమ్ముబాకీ పడ్డం ఏంటి అనుకుంటన్నారా? నాది పిచ్చివాగుడని నవ్వుకుంటన్నారా బావూ? కాదు బాబయ్యా కాదు. సత్తె పెమానకంగా దుర్గారావుగోరు నాకు డబ్బియ్యాల. తవరికి సేతిలో జరూరు పని లేదంటే ఆ కతంతా సెప్పుకొత్తాను మరి.

నిన్నగాక మొన్న సెయిర్మేను ఎలచ్చను జరిగింది కదా బాబయ్యా. అల్లందులో దుర్గారావుగోరు నిలబడ్డారు కదా. అప్పుడు ఆ సామి ఇల్లిల్లూ తిరుగుతూ నా గుడిసెకీ వొచ్చేరు. జీపు దిగొచ్చి 'ఒసే ముసిల్దానా' అని పిల్సేరు. ఓటున్న మా తల్లివంటూ దండవెట్టారు. మా ఇంటాయన ఇశ్వాసంగా పనిజేసే వోడంటూ పొగిడేరు. నా కస్టం జూసి కన్నీరెట్టుకున్నారు. సర్కారుసొమ్ము తినే యోగం కల్పిత్తాన్నారు. నెల నెలా అదేదో పెన్సనో ఏదో ఇప్పిత్తాన్నారు. ఆరికే ఓటెయ్యాలన్నారు. ఆరి మాటలు నచ్చాయి. మాటా మంచీ నచ్చింది. మా బోటి పేదోళ్ళకి ఏవైనాసేత్తే ఆరిలాంటి కలిగున్న మారాజులే సెయ్యాలనుకున్నాను. మరేవీ ఆలోసించకుండా ఆరికే ఓటేత్తానని ఒట్టేసేను.

నువ్వెక్కడో పిచ్చిదానివి. ఏదోటి ఇచ్చినాక ఓటేత్తాననక బోయావా అన్నారు సుట్టుపక్కలి గుడిసెలోళ్ళు. వూరుకెల్లా మోతుబరి దుర్గారావుగోరు. ఆయన పెద్దమనసు సేసుకుని నాకేదో సాయం సేత్తానన్నారు. అది సాలదా సెప్పండి బావూ? అందుకే ఆరికే నా ఓటు ఆరి కుక్కమీదే నా ముద్దర అని సెప్పేశాను.

ఆ మర్నాడు ఎగస్పార్టీ వోడొచ్చాడు. ఆరూ నా గుడిసె ముంగటాల కొచ్చి దండవెట్టారు. ఓ టెయ్యాలే నర్సీ అన్నారు. అబద్ధం ఎందుకాడాల? అందుకే దుర్గారావుగోరికి మాటిచ్చేశానని సెప్పేను.

ఆడో ఎధవ. ఎంగిలిసేత్తో కాకిని కూడా అదిలించడు. తను బొక్కడమేగాని పెట్టడం చేతకాని నీచుడంటూ తిట్టిబోసినారు. అలాటోడి మాటలు నమ్మి మోసపోవద్దు. ఇంద రెండొందలు తీసుకుని ఓటెయ్యి అన్నాడు. సెప్పొద్దూ- మా సెడ్డకోపం వొచ్చింధి. కూటికి లేని దాన్నిగాని మానాభిమానాలు లేన్దాన్ని కాదని ఒంటికాలు మీద లేశాను. సెడతిడుతూ పోయారు!

తమరు సెప్పండి బాబయ్యా. నాను సేసింది తప్పా? ఒకరికి మాటిచ్చాక దానికి కట్టుబడి వుండాల్నా లేదా? పేణం ఇవాలుంటది రేపు పోద్ది. కాని మాట పోదు కదా? మాటల్తో ఇసిగిస్తన్నాన్నా బాబయ్యా. అసలు సంగతి రెండు ముక్కల్లో సెప్పేత్తానుగాని ఈ ముసిల్దానికోసం కొంచెం ఓపిక సేసుకోండి.

తమరికి తెలుసోలేదోగాని బాబయ్యా-ఓట్ల పండక్కి ముందు రోజు రేత్రి దుర్గారావుగోరి తాలూకోళ్ళు డబ్బు పంచినారు బాబయ్యా. ఇల్లిల్లూ తిరిగి ఇంటి తలుపుతట్టి ఇంట్లో ఎన్ని ఓట్లుంటే అన్నొందలు ఇచ్చేరుసావీ. నాగుడిసెకి మాత్రం రాలేదు. వూరికి కడైపోయింది గదా. అయినా ఎండెక్కేదాకా ఎదురుసూత్తానే వున్నా. ఎవుర్రాలేదు. మా పేటలో డబ్బు పంచినోడ్ని అడగమన్నారంతా. అందరికీ ఇచ్చి నాకీయకపోడం అన్నాయం కదా బాబయ్యా. కడుపు తరుక్కుపోతాది కదా బావూ. అందుకే ఎళ్ళేను బాబయ్యా. నానేం అబద్ధమాళ్ళా. నా ఇంట ఒకిటే ఓటుంది. వందనోటు ఇమ్మన్నా. 'డబ్బైపోయింది. దుర్గారావు కాడ్నించొచ్చేక ఇత్తాన్లే' అన్నాడు. మీరూ మీరూ సూసుకుందరుగాని నాకు రూపాయలిమ్మని బతిమాల్నా. లేవంటూ కసిరేశాడు. మళ్ళేమనుకున్నాడో దుర్గారావుగోరింటికి పో ఇత్తాడన్నాడు.

కాళ్ళీడ్చుకుంటూ దుర్గారావుగోరి మేడదగ్గరి కెళ్ళా. ఆ బాబు శానా గడబిడగున్నాడు. బోల్డు జనవూ కార్లూ- అబ్బో శానా సందడిగా వుంది. ఏం సెయ్యడంరా భగమంతుడా అనుకుంటా వుంటే దేవుడల్లే బయటి కొచ్చినారు దుర్గారావుగోరు.


దారి కడ్డం పడి దండ పెట్టా. రూపాయలు ముట్టలేదన్జెప్పేను. ''డబ్బు గురించి బెంగెట్టుకో మాకు. అందరికీ ఇచ్చినట్టే నీకూ ఇస్తాను. ముందెళ్ళి మన గుర్తు కుక్కమీద ఓటేసిరా'' అన్సెప్పేరు.

పెద్దోరి మాట తోసేసి ముందు డబ్బియ్యి సావీ అని నిలెయ్యలేను గదా. అలాగే బాబయ్యా అన్చెప్పి వొచ్చేశాను.

కడుపులో కాల్తున్నా సద్దికూడు తినకండా ఓట్లకాడ కెళ్ళి ఓటేశాను. సచ్చిసొర్గానున్న మా ఇంటాయన మీద ఒట్టేసి సెబుతున్నా దుర్గారావుగారికే ఓటేసినా. ఆరి కుక్క గుర్తుమీదే ముద్దరేసినా. ఏలు మీదేసిన నల్లసుక్క తోడు!

ఓటేసినాక దుర్గారావుగోరింటి కెళ్ళినా. ''తర్వాత రా-ఫో'' అని కసిరేరు గేటుకాడే. ఎలచ్చన్ అయ్యేక ఎల్లినా. ''ఓట్లు లెక్కెట్టనీ.వూరికే పేణాలు తీస్తావేంటీ'' అని కోప్పడ్డారు దుర్గారావుగోరు. తొప్పైపోయింది బాబయ్యా. ఏదో పెద్దాన్ని. వంద రూపాయ లిత్తే రెండ్రూపాయల బియ్యం కొనుక్కుని రెండు ముద్దలు తింటానని బతిమాలాను. కాళ్ళా వేళ్ళా బడ్డాను.

''యాభై లక్షల పెట్టుబడి కుమ్మరించాను: రిజల్ట్ ఏమవుద్దోనని నేను టెన్షన్తో ఛస్తోంటే మధ్యన



నీగోలేంటే ముసిల్దానా-ఫో అవతలకి'' ఆవటాని కూకలేశారు!

బిక్క-సచ్చిపోయి సేతులు జోడించా.

''వేలమంది కిచ్చినోడు నీకు ఎగ్గొడతాడేంటి. కౌంటింగు పూర్తయ్యాకరా'' అని సెప్పేడు పక్కనున్నాయన.

మొకం ఏలాడేసుకుని తిరిగొచ్చాను.

దుర్గారావు గోరు సెయిర్మేనుగా నెగ్గేరు. పూలరథం మీద వూరేగేరు. మందు గుండు సామాగ్రి వూరదిరేలా కాల్చేరు. రంగరంగ వైభోగంగా వూరంతా తిరిగేరు. వూరిని నందన వనం సేసేత్తానని ప్రతి కూడలిలోనూ సెప్పేరు. ఆయన నన్ను సూత్తే గుర్తుపడితే డబ్బిచ్చేత్తారని ఆశతో వూరేగింపు కూడా తిరిగాను బాబయ్యా. మొహం కన్పించనన్ని పూలదండలు ఏసేసి నందుక్కా-బోలు ఆరి కంటికి నేను ఆనలేదు!

దుర్గారావు గోర్ని ఎదుక్కుం-టూ ఆయనిం టికెళ్ళేను. లేరన్నారు. మళ్ళీ ఎళ్లేను. మళ్ళీ మళ్ళీ ఎళ్లేను. వూహూ. ఆయన కన్పించనే లేదు. సన్మానాని కెళ్ళేరన్నారు. మీటింగుందన్నారు. అయిదరాబాదె ళ్ళేరన్నారు. మంత్రొస్తావుంటే ఎళ్ళేరన్నారు. కాళ్ళరిగేలా నెల్లాళ్ళ నుంచి తిరుగుతున్నాను. ఆ బావు దర్శనం కాలేదు బాబయ్యా!

కాళ్ళు లాక్కొ-చ్చాయి. పేణం సాచొచ్చింది. అందుకనే రోడ్డేపోయే మీకూ మీకూ మొరెట్టుకుం టున్నాను. బాబయ్యా! తవరైనా ఆ దుర్గారావు గోరికి సెప్పి నా వందరూపాయలు నా కిప్పించండి. నాలాటి పెద్దాన్ని మోసం సెయ్యడం ఆరికి జయం కాదని సెప్పండి.

రేపట్నుంచి ఆరు బోల్డు బోల్డు సంపాదించు కుంటారు. బోల్డు మేడలు కడతారు. మిద్దెలు కడతారు. కాలేజీలు పెడతారు. కంపెనీలు తెరుత్తారు. లక్షలు కోట్లు సంపాదిత్తారు. మరి అసువంటప్పుడు నావందా నాకివ్వకపోడం అన్యాయం కదా బావూ? దరమం మీరే సెప్పండి!

అదేంటి సామీ అలా సూత్తన్నా రు? ఈ సిగ్గులేని ముసిల్దినా డబ్బు నా డబ్బని లేకిలా దేవిరిస్తోం దనుకుంటున్నారా బాబయ్యా. ఏం సెయ్యను బాబయ్యా. ఓటు తప్ప ఏవీ లేని దాన్ని! అయినా అందరికీ ఇచ్చినట్టే నాకూ ఇమ్మం టున్నానుగాని నాకెక్కువ అడ గట్లేదు కదా. గెలిచినోడు రేపు సంపాదించేదాంట్లో వాటా అడ గట్లేదు కదా. ఓటు ఎలాగూ అయిదేళ్ళు నన్ను సల్లగా సూడదు. కనీసం ఓ ఆర్నెల్లు ఓ ముద్దపెడతానంటే వద్దన్నేనుగదా తండ్రీ. ఆకలి బాధ నీకు తెల్దా సామీ. కడుపుకిన్ని మెతుకులు కావాలి గాని నీతులూ సూత్రాలూ గొప్ప కబుర్లూ నాకెందుకు బాబయ్యా- పేడ ఏరుకుని బతికే ముసిల్దాన్ని!

బాబయ్యా! తమరు నా గురించేవైనా అనుకోండి. ఎన్నైనా తిట్టండి. ఈసడించండి. కాని బాబయ్యా- దుర్గారావుగోరికి సెప్పి నా ఓటు సొమ్ము ఇప్పించండి.



అదే పది వేలు సామీ. మీకూ దుర్గారావుగోరికీ వేన వేల దండాలు సామీ. మీకోసం, తమరు తెచ్చే సల్లని కబురుకోసం సూత్తావుంటాను తండ్రీ. వూరవతల రావిసెట్టు పక్కన సగం కూలిన గుడిసెలో సగం సచ్చిన దిక్కులేని ముసిల్దాన్ని..గుర్తెట్టుకోండి బాబయ్యా.. వుంటాను బాబయ్యా..దండాలు బాబయ్యా!...

★